

అక్కన్నపేట మండలం పెద్దతండాలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

## పెద్దతండాలో వైద్యశిబిరం

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కన్నపేట, ఆగస్టు 6: తీవ్రమైన విష జ్వరాలతో గిరిజన తండావాసులు పడుతున్న ఇబ్బందులపై మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో "మంచం పట్టిన పెద్దతండ" శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. అక్కన్నపేట మండలం పెద్దతండలో వైద్యాధికారి రమ్య ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సిబ్బంది 54 మందిని పరీక్షించారు. ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే నిర్వహించారు. ఎంపీడీవో బానోతు జయరాం తండాలో మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, ఎంపీవో కవికుమార్, పంచాయతీ కార్యదర్శులు సందర్శించారు.



రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోస్తున్న పంపులు

## రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలు

రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో గోదావరి జలాలు పరవళ్లు తొక్కాయి. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల సరిహద్దులో 3.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన అనంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి మంగళవారం రెండు పంపుల ద్వారా ఎత్తిపోతలను నీటి పారుదల శాఖ అధికారులు ప్రారంభించారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్ సామర్థ్యం 3 టీఎంసీలు కాగా ఇప్పటికే రిజర్వాయర్‌లో 0.68 టీఎంసీల నీరు నిల్వ ఉందని శనివారం వరకు రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోయనున్నట్లు అధికారులు వెల్లడించారు. సరిపడా వర్షాలు పడని తరుణంలో రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుండటంతో రైతులకు ఆశాజనకంగా మారింది.

- చిన్నకోడూరు, ఆగస్టు 6



రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో గోదావరి జలాల పరవళ్లు

## వీధికుక్కల దాడిలో 80 గొర్రెలు మృత్యువాత



కుక్కల దాడిలో మృత్యువాత పడ్డ గొర్రెలు

మద్దూరు, ఆగస్టు 6: వీధి కుక్కల దాడిలో 80 గొర్రెలు మృత్యువాత పడ్డ సంఘటన మద్దూరు మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నంగి కొమురయ్య, నంగి చంద్రయ్య గ్రామానికి కొద్ది దూరంలో ఏర్పాటు చేసుకున్న దొడ్డిలో సాయంత్రం గొర్రెలను వదిలి ఇంటికి వెళ్లారు. ఉదయం వచ్చి చూడగా, సుమారు 80 గొర్రెలు మృతి చెంది కనిపించాయి. వీధి కుక్కల దాడిలో అవి చనిపోయినట్లు భావిస్తున్నారు. దీంతో సుమారు రూ. 10 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. గతంలో సుమారు 40 గొర్రెలు చనిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. నష్టపోయిన గొర్రెల కాపరులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు.

# దళారుల దందాకు చెక్



● కొత్త చట్టంలో రెవెన్యూ మార్పులు ● భూ సమస్యలకు పరిష్కారం

● ఆర్వోఆర్ - 2024తో పారదర్శకత ● కలెక్టర్లపై తగ్గనున్న భారం

గజ్వేల్, ఆగస్టు 6: ఇటీవల గజ్వేల్ డివిజన్ పరిధిలోని ఓ తహసీల్దార్ కార్యాలయంలో కేవలం నాలుగు గుంటల భూమికి సంబంధించిన వివాదాన్ని పరిష్కరిస్తామని ఓ పార్టీకి చెందిన నాయకుడు రూ.లక్షన్నర వరకు వసూలు చేశాడు.

పీవోబీలో ఉన్న భూములను విడుదల చేయిస్తామని ఓ మండలానికి చెందిన నాయకులు రూ.50వేలు వసూలు చేసి పని కాకపోవడంతో తిరిగి వాపసు చేసినట్లు తెలిసింది. ఇలాంటి అక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి లోటుపాట్లను సవరిస్తూ భూమాత పేరిట తీసుకొస్తున్న ఆర్వోఆర్ చట్టం రైతులకు, భూ యజమానులకు అండగా నిలవనున్నది.

కొన్నాళ్లుగా భూమికి సంబంధించిన రికార్డుల్లో అనేక రకాల మార్పులు తీసుకొచ్చినా భూముల విషయంలో తగాదాలు, అవినీతి, ఆక్రమణలు తగ్గట్లేదు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో క్లియర్‌గా ఉన్న భూములకు ఎలాంటి ఇబ్బందులూ లేవు. ధరణిలో నమోదు కానీ భూములతో అనేక సమస్యలు వస్తున్నాయి. ఇక పీవోపీ (ప్రొహిబిటెడ్ ఆఫ్ ప్రాపర్టీ) కింద ఉన్న భూముల్లో కొందరు అధికారులు, నాయకులు దందాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం "భూమాత" పేరిట నూతన ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నది. ఈ క్రమంలో ముసాయిదా బిల్లును అసెంబ్లీలో ఇటీవల రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ప్రతీ కమతానికి జియో ట్యాగింగ్‌తో కూడిన భూదార్ నంబర్‌ను కేటాయించనున్నారు. ఈ బిల్లుపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు ఈనెల 23 వరకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయించారు.

### పటిష్ఠం కానున్న రెవెన్యూ వ్యవస్థ

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో పాటు రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనతో గ్రామస్థాయిలో పని చేసే వీఆర్‌వోలు, వీఆర్‌ఏలను ఆయా శాఖల్లో విలీనం చేశారు. సిద్దిపేట జిల్లాలో రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసే సమయానికి 281 మంది వీఆర్‌వోలు, 1300 మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు. వీఆర్‌వోలను ఆయాశాఖల్లో విలీనం చేశారు. అర్హత గల వీఆర్‌ఏలను పేస్కేల్ వర్తింపజేస్తూ ఆయాశాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా, అర్హత లేని వారిని నీటిపారుదలశాఖలో నీరడిలుగా నియమించారు. 60 ఏళ్లకు చేరువలో ఉన్న వారి విషయమై ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం తీసుకొస్తున్న బిల్లులో గ్రామానికో రెవెన్యూ కార్యదర్శిని నియమిస్తామని ప్రభుత్వం చెబుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో 380 రెవెన్యూ గ్రామ పంచాయతీలకు కార్యదర్శుల నియామకం జరుగనున్నది. గ్రామస్థాయిలో జరుగుతున్న ఆయాఅంశాలతో పాటు శాంతిభద్రతలు, ఇతరత్రా అంశాలు రెవెన్యూ శాఖకు బదిలీ కానున్నాయి. దీంతో మరోసారి రెవెన్యూ వ్యవస్థ పటిష్ఠం కానున్నది.

### సాదాబైనామాలకు మోక్షం

ఆర్వోఆర్ చట్టం ప్రకారం ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలకు మోక్షం కలగనున్నది. కొత్త సాదాబైనామా దరఖాస్తులకు అవకాశం కల్పించడంతో పాటు రుసుం తీసేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో తెల్లకాగితంపై కొనుగోలు చేసిన భూములకు హక్కులు కలగనున్నాయి. ఈ సాదాబైనామాలను హెచ్ఎండీఏ పరిధిలో అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేనట్లు సమాచారం. మర్కుక్, ములుగు, వర్గల్ మండలాల్లో సాదాబైనామాలకు అవకాశం లేకుండాపోనుంది.

### పెరగనున్న పారదర్శకత

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రెవెన్యూ ముసాయిదా బిల్లులో పొందుపరిచిన అంశాలతో పాటు ప్రజల నుంచి సేకరించిన అంశాలతో పటిష్ఠమైన ఆర్వోఆర్ యాక్టును తయారు చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అన్ని రకాల సేవలకు కలెక్టర్‌లతో ముడిపడి ఉండగా, తాజాచట్టంతో తహసీల్దార్లకు, ఆర్డీవోలకు బదలాయింపును కేటాయించారు. ముఖ్యంగా మ్యూటేషన్, సాదాబైనామా, ఓఆర్సీ(ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్) అప్పీలింగ్‌కు సంబంధించిన అంశాలను ఆర్డీవోలకు అందించనుండగా, ఫౌతి విరాసత్‌తో పాటు మరికొన్ని అంశాలను తహసీల్దార్లకు అప్పగించనున్నారు. ఇక కలెక్టర్ల స్థాయిలో ఇప్పటివరకు ఉన్న పనిభారం ఆర్డీవోలకు, తహసీల్దార్లకు ఆయా అంశాలు బదలాయించడంతో కలెక్టర్లపై పనిభారం తగ్గనుంది. ఇప్పటివరకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్న సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉండగా, ప్రస్తుతం తహసీల్దారు స్థాయిలో జరిగిన తప్పిదాలపై ఆర్డీవో స్థాయిలో అక్కడ న్యాయం జరగని పక్షంలో అదనపు కలెక్టర్ స్థాయిలో అప్పీలింగ్ వ్యవస్థను తీసుకురానున్నారు. ఈ అప్పీలింగ్ వ్యవస్థ లేకపోవడంతో ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి దాదాపుగా 3.50 లక్షల కేసులు నమోదైనట్లు రికార్డుల ద్వారా తెలుస్తున్నది.




# ఎన్నాళ్లకెన్నాళ్లకు..

● మల్లన్న ఆలయ ఉద్యోగుల బదిలీ ● పదిహేడేళ్ల తరువాత స్థానచలనం

చేర్యాల, ఆగస్టు 6 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఎట్టకేలకు పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. నాలుగేళ్లకు మించి విధులు నిర్వహిస్తున్న వారిని గుర్తించినా, 40 శాతం మించకుండా స్థానచలనానికి చర్యలు చేపట్టారు. మల్లన్న ఆలయం నుంచి ఎలక్ట్రికల్ ఏఈ అంజయ్య, జూనియర్ అసిస్టెంట్లు ఇ.సందీప్, పి.మాధవిని యాదాద్రి లక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయానికి బదిలీ చేశారు. వీరిస్థానంలో యాదాద్రి ఎలక్ట్రికల్ ఏఈ ప్రభాకర్‌రావు, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం నుంచి లక్ష్మీరాజ్యం, యాదాద్రిలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ నర్సింహులును కొమురవెల్లికి బదిలీ చేశారు. అలాగే మల్లన్న ఆలయంలో సూపరింటెండెంట్ పోస్టులు రెండు ఖాళీగా ఉండటంతో వేములవాడనుంచి శ్రీరాములు, యాదాద్రి నుంచి సురేందర్‌ను నియమించారు. ఉత్తర్వులు అందుకున్న మూడురోజుల్లో విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసిన క్రమంలో ఎవరు ఉంటారు..మరెవరు చేరతారు అన్న విషయం ఆసక్తికరంగా మారింది. 17 యేళ్ల తరువాత బదిలీలు చేపట్టడం చర్చనీయాంశమైంది. నాలుగేళ్లకుపైగా విధులు నిర్వహిస్తున్న వారిలో ఏఈవో గంగా శ్రీనివాస్‌ను ప్రతిపాదించినప్పటికీ కొన్నినెలలక్రితం చోటుచేసుకున్న వీవీఐపీ పాసుల విక్రయం, డ్యూటీల విషయమై ఎలక్ట్రికల్ ఏఈ అంజయ్యపై చేయిచేసుకోవడంతో పాటు ఇటీవల చేపట్టిన హుండీ లెక్కింపులో బంగారు గొలుసు చెత్తబుట్టలో లభ్యమైన విషయాలపై సస్పెండ్ చేశారు. ఇక్కడి నుంచి ఆయనను బదిలీ చేయకుండా ఉండేందుకే సస్పెన్షన్ వేటు వేశారన్న ఆరోపణలు ఎదుర్కుంటున్న దేవాదాయశాఖాధికారులు ఆయన విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తి కలిగిస్తుంది.

# హుస్నాబాద్ అమరుల స్థూపం వద్ద గద్దర్ వర్ధంతి

● హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, ఆగస్టు 6: మావోయిస్టు పార్టీ (అప్పటి పీపుల్ వార్) హుస్నాబాద్‌లో నిర్మించిన ఆసియాలోనే అతిపెద్దదైన అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం ప్రజాయుద్ధనౌక గద్దర్, సియాసత్ ఎడిటర్ జహీరోద్దీన్‌ల ప్రథమ వర్ధంతి, తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నియోజకవర్గ జేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. గద్దర్ కుమార్తె వెన్నెల ఆన్‌లైన్‌లో(సెల్‌ఫోన్ వీడియో కాల్‌లో) అక్కడికి వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడారు. మావోయిస్టులు నిర్మించిన 88 అడుగుల అతిపెద్ద స్థూపాన్ని 1990 అక్టోబరు 25న అప్పటి జననాట్య మండలి కళాకారుడిగా గద్దర్ ఆవిష్కరించారు. దీనిని 2000 సంవత్సరంలో గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి వేశారు. ఈ స్థూప నిర్మాణంలో గద్దర్ ప్రధాన పాత్ర పోషించారని, ఈ స్థూపం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొన్నటి వరకు ధ్వంసమైన స్థూపం తుమ్మలు, తుప్పలు, పొదల మధ్య కనిపించకుండా ఉండేది. వాటిని తొలగించి స్థూప పరిసరాలను శుభ్రం చేశారు. చెట్లలో పడి ఉండి శిథిలమైన 88 కిలోల సుత్తి కొడవలి గుర్తును బయటకు తీశారు. దానికి రంగులు వేసి ధ్వంసమైన స్థూపం వద్ద ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన కళాకారులు తమ ఆటపాటలతో అలరించారు. స్థూపం వద్ద ఏర్పాటు చేసిన గద్దర్ చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. అప్పట్లో స్థూప నిర్మాణంలో భాగస్వాములైన ఎంతో మంది సానుభూతి పరులు, ఉద్యమ కారులు, ప్రజలు స్థూపం వద్ద సెల్ఫీలు తీసుకున్నారు. కార్యక్రమంలో జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, కోఆర్డినేటర్లు మేకల వీరన్న యాదవ్, ద్యాగల సారయ్య, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఒస్కుల సుధాకర్, నాయకులు కొయ్యడ కొంరయ్య, గడిపె మల్లేశ్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వడ్డెపల్లి మల్లేశం తదితరులున్నారు.



గద్దర్ చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ



ధ్వంసమైన స్థూపం వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్న ప్రజలు

### అధికారికంగా గద్దర్ సంస్మరణ సభ: పొన్నం

ప్రజాయుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ స్థూప నిర్మాణంలో గద్దర్ కీలకపాత్ర పోషించారన్నారు. గన్నుతో కాకుండా ప్రజాస్వామ్యయుతంగా అన్యాయాలను ఎదుర్కోవచ్చన్నారు. ఓటు అనే ఆయుధంతో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం పోరాటం జరిగితే మలిదశ తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాటాలు జరిగాయన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ గద్దర్ ఆశయ సాధన కోసం ప్రతి యువకుడు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# హుస్నాబాద్ అభివృద్ధిలో ముందుకుసాగాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 6: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంతో హుస్నాబాద్ పట్టణం అభివృద్ధిలో ముందుకు సాగాలని రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని కొత్తచెరువు వద్ద చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నాడే సంజయ్‌గాంధీ పర్యావరణ హితం కోసం మొక్కలు నాటాలని సూచించారని గుర్తుచేశారు. కానీ ఆయన మాట వినకపోవడం వల్లే ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందన్నారు. మన జీవితంలో స్వచ్ఛదనం-పచ్చదనం ఒక భాగం కావాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేపట్టి రెండురోజులే గడిచిందని, ఈనెల 9 వరకు జరిగే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆయన కోరారు. రాబోయే తరం ఆరోగ్యంగా బతకడానికి ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేయాలన్నారు. వీలైనంత వరకు స్వచ్ఛమైన గాలి, తాగేనీరు, వాతావరణం, తినే ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అవుతుందని ఇప్పటికే ప్రజలు మెచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని మంత్రి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎవరైన సలహాలు ఇవ్వవచ్చన్నారు. ఎన్నికల వరకు రాజకీయాలు, ఎన్నికల తర్వాత అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎల్లమ్మ చెరువు కోసం ఇప్పటికే రూ. 3 కోట్లు కేటాయించామని, కొత్తచెరువు అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. పట్టణంలోని ప్రభుత్వ భూములు ఎవరు కబ్జాచేయకుండా అధికారులు బాధ్యతగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌ఛైర్‌పర్సన్ అనితారెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమీషనర్ మల్లిఖార్జున్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, రాజు, సరోజన, స్వర్ణలత, నళినీదేవి, వేణు తదితరులు ఉన్నారు.



స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మంత్రి పొన్నం, కలెక్టర్


## సిద్దిపేటలో అరుదైన జాతి కప్పలు



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఇండియన్ బుల్ ఫ్రాగ్ జాతికి చెందిన అరుదైన రకం (పసుపు రంగు) కప్పలు భూమిలో నుంచి బయటకు వచ్చాయని స్థానికులు తెలిపారు. వర్షాకాలం ఆరంభంలో ఇలా పసుపు రంగులోకి మారతాయని, ఒకటి, రెండు రోజులు కనిపించి మళ్లీ భూమిలోకి వెళ్లిపోతాయని ఇంతకు ముందు ఇలాంటి కప్పలు ఎక్కువగా కనిపించేవని ప్రస్తుతం అరుదుగా కన్పిస్తున్నాయని రైతులు చెప్పారు.

-ఫొటోలు: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట





కమిషనరేట్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

### మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన జయశంకర్

8

## పింఛన్ ఇవ్వండి సారూ..!

- ఉమ్మడి రాష్ట్రంలో అమలు
- తెలంగాణ ఆవిర్భావం తర్వాత మొండిచేయి
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 79 మంది ఎదురుచూపు
- 2008 జూన్ 30 లోపు రిటైర్ అయిన వీఆర్వోలు, కార్యదర్శుల ఆవేదన

7లో

## డీడీలు కట్టిన గొర్రెకాపరులకు డబ్బులు చెల్లించాలి

నారాయణఖేడ్: రెండోవిడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించినవారికి వెంటనే అకౌంట్ల డబ్బులు వేయాలని గొర్రెకాపరుల సహకార సంఘం నాయకులు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకు వినతిపత్రం అందజేశారు.

## 57 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



తూప్రాన్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

తూప్రాన్/మనోహరాబాద్, ఆగస్టు 6: తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో అక్రమంగా తరలిస్తున్న 57 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. తూప్రాన్, మనోహరాబాద్ ఎస్‌ఐలు శివానందం, సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. హైదరాబాద్, మేడ్చల్ ప్రాంతం నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు రెండు లారీలో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దాంతో మనోహరాబాద్‌లో ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ ఆధ్వర్యంలో 28 టన్నులు రవాణాచేస్తున్న బియ్యం లారీని పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ సాధిక్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. మనోహరాబాద్‌లో 28.2 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుకున్నట్లు వివరించారు. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన తనిఖీల్లో 29.1 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుకున్నట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరించారు. మనోహరాబాద్‌లో డ్రైవర్ సుఖ్‌దేవ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. తూప్రాన్ పట్టణంలో పట్టుబడిన 620 బస్తాల్లోని 291.20 క్వింటాళ్ల బియ్యం విలువ రూ.7,57,120 లక్షలు ఉంటుందని, సీజ్‌చేసిన లారీ విలువ రూ.25 లక్షలు ఉంటుందని డిప్యూటీ తహసీల్దార్ సాధిక్ హుస్సేన్ పేర్కొన్నారు.

## బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్



పాఠశాలలోని వంటకాలను తనిఖీ చేస్తున్న రమేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 6: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ సూచించారు. సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలుర పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించి న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలం కారణంగా పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చదువుతోనే ఉన్నతంగా ఎదుగుతామన్న విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం వంటశాల, బాత్‌రూమ్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, పిల్లల వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యూరియా అందుబాటులో ఉంచకపోతే చర్యలు

● మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

కౌడిపల్లి, ఆగస్టు 6: యూరియాను అందుబాటులో ఉంచని ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తప్పవని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ హెచ్చరించారు. మంగళవారం కౌడిపల్లి డివిజన్ పరిధిలోని చిలప్‌చెడ్, కొల్చారం, వెల్దుర్తి, మాసాయిపేట మండలాలకు చెందిన ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులతో మండల కేంద్రంలోని రైతువేదికలో ఏడీఏ పుణ్యవతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు జరగకుండా ప్రతీ ఫర్టిలైజర్ షాపులో యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని పేర్కొన్నారు. వరినాటులో రెండోసారి యూరియా అవసరం ఉన్న రైతులకు నానో యూరియా ఎంతో పనిచేస్తుందని, రైతులు వాడుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి ఏఈవో స్వప్నజాదవ్, చిలప్‌చెడ్ ఏఈవో బాబు, కొల్చారం ఏఈవో శ్వేతకుమారి, వెల్దుర్తి ఏఈవో ఝాన్సీలతో పాటు ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

● ప్రమాదంలో తెగిపోయిన కాలు

మర్కుక్, ఆగస్టు 6: కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో పాటు కాలు తెగిపోయిన సంఘటన మర్కుక్ మండలంలో చోటు చేసుకున్నది. మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన దేశమైన చంద్రం(35) ద్విచక్ర వాహనంపై గణేష్‌పల్లి నుంచి బేబర్తికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న కారు వెనకనుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్రం కుడి కాలు మోకాలి వరకు విరిగి ఊడి పడింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా ఢీకొట్టిన వ్యక్తి పాములపర్తి గ్రామానికి చెందిన తాడెం బాబుగా గుర్తించి, కారును పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామన్నారు. గాయపడిన చంద్రంను కుటుంబసభ్యులు లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు.

## పాపం పసివాళ్లు..

● బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు


బస్టాండ్‌లో వదిలివెళ్లిన మూడేళ్ల బాలుడు, ఆరునెలల చిన్నారి

పటాన్‌చెరు, ఆగస్టు 6: తల్లి ఒడిలో హాయిగా ఆడుకోవాల్సిన మాటలు కూడా రాని పసివాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు పటాన్‌చెరు బస్టాండ్‌లో వదిలివెళ్లిన హృదయవిదారకమైన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు మూడేళ్ల బాలుడు, ఆరునెలల చిన్నారిని గుర్తుతెలియని వ్యక్తులు పటాన్‌చెరు బస్టాండ్‌లో వదిలివెళ్లారు. గుక్కపట్టి పిల్లలు ఏడుస్తుండగా, అక్కడే పనిచేసే స్వీపర్ గుర్తించి అక్కున చేర్చుకుంది. బస్టాండ్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పిల్లలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంరక్షించారు. మంగళవారం ఉదయం మహిళా శిశుసంక్షేమ అధికారులు పిల్లలను స్వాధీనం చేసుకుని సంగారెడ్డికి తరలించారు. పోలీసులు పిల్లలను వదిలిన గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు వదిలివెళ్లారా, ఎవరైనా కిడ్నాప్ చేసి ఇక్కడ వదిలివెళ్లారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా చిన్నారులను వివరాలు అడగ్గా సరిగ్గా చెప్పలేకపోతున్నారని మహిళా శిశు సంక్షేమ అధికారులు తెలిపారు.

## హత్య కేసులో నిందితులు అరెస్ట్

● వివాహేతర సంబంధమే కారణం

● అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

అల్లాదుర్గం, ఆగస్టు 6: అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లో ఈ నెల 4న జరిగిన హత్య కేసును ఛేదించి, ఆరుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఒకరు జూన్ 22న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఇతడి భార్యతో అదే గ్రామానికి చెందిన చిత్తారి భేతయ్యకు వివాహేతర సంబంధం ఉండడంతోనే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు అప్పట్లో భేతయ్యతో గొడవపడ్డారు. దీంతో భేతయ్య గ్రామాన్ని వదిలి సమీపంలోని గడిపెద్దాపూర్‌లో నివాసముంటూ గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. భేతయ్యపై కక్ష పెంచుకున్న ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబసభ్యులు అతడిని హతమార్చాలని భావించి అదును కోసం వేచిచూశాడు. ఈ నెల 4న భేతయ్య, మల్లేశం అనే వ్యక్తి కలిసి గడిపెద్దాపూర్ శివారులో గొర్రెలు కాస్తూ ఉన్నాడు. ఈ విషయాన్ని మల్లేశం ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బంధువుకు ఫోన్ ద్వారా సమాచారమందించాడు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోచయ్య మల్లేశంతో కలిసి భేతయ్యను గొడ్డలితో హతమార్చారన్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి రెండురోజుల్లోనే కేసును ఛేదించామని సీఐ తెలిపారు. హత్యకు సహకరించిన మరో నలుగురు నిందితులు రాజు, సిద్ధయ్య, రమేష్, అంబయ్యలను అదుపులోకి తీసుకొని విచారించగా ఈ నేరాన్ని అంగీకరించినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


కనకయ్య(ఫైల్)

చిన్నకోడూరు, ఆగస్టు 6: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చెట్టబోయిన కనకయ్య(55) ప్రస్తుతం సిద్దిపేట పట్టణం హనుమాన్‌నగర్‌లో ఉంటున్నాడు. కనకయ్యకు మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చిన్న పాటి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. మద్యం సేవించినప్పుడు మత్తులో ఇష్టారీతిగా తిరిగేవాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి రామునిపట్ల శివారులో రాజీవ్ రహదారిపై కనకయ్య నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తల, గదవ, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా వివాహమైన కొద్దిరోజులకే కనకయ్య భార్య అతనిని వదిలి వెళ్లిపోయింది.

## చరిత్రపై విస్తృత పరిశోధనలు జరగాలి

● మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, ఆగస్టు 6: చరిత్రపై విస్తృత పరిశోధనలు జరగాలని అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ క్యాంపస్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరుగునపడిన తెలంగాణ చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చరిత్ర విభాగం నిర్వహిస్తున్న ఈ సదస్సు విద్యార్థులకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హుస్సేన్, చరిత్ర విభాగ అధిపతి గణపతి పాల్గొన్నారు.

# పింఛన్ ఇవ్వండి సారూ..!

● ఉమ్మడి రాష్ట్రంలో అమలు
● తెలంగాణ ఆవిర్భావం తర్వాత మొండిచేయి
● ఉమ్మడి జిల్లాలో 79 మంది ఎదురుచూపు
● 2008 జూన్ 30లోపు రిటైర్ అయిన వీఆర్వోలు, కార్యదర్శుల ఆవేదన

తొగుట, ఆగస్టు 6: ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా వారికి నెలనెలా పింఛన్ వచ్చేది. కానీ, రాష్ట్రం విడిపోయాక ఏపీలోకి వెళ్లిన వారికి పింఛన్ అందుతోంది. అదేం పాపమో కానీ, తెలంగాణలోని వారు మాత్రం ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు తమకు పింఛన్ ఇవ్వాలని కాళ్లరిగేలా తిరుగుతున్నారు 2008 జూన్ 30 కంటే ముందు రిటైర్ అయిన వీఆర్వోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు. గ్రామాల్లో రెవెన్యూ, శాంతిభద్రతలను చక్కదిద్దేందుకు పనిచేసిన పట్వారీ, పటేల్ వ్యవస్థను 1984లో అప్పటి సీఎం ఎన్టీఆర్ రద్దు చేశారు. ఉపాధి కోల్పోయిన వేలాదిమంది సుదీర్ఘ పోరాటం చేయగా, 1992లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1992లో అర్హులైన వారిని ప్రభుత్వం వీఏఓలుగా నియమించింది. అప్పట్లో రూ.600 గౌరవవేతనంతో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేశారు. చివరకు పదోతరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారిని 2002 జనవరి ఒకటి నుంచి పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ ఇచ్చారు. వారిని వీఆర్వోలుగా, కార్యదర్శులుగా నియమించారు. అయితే, 2002లో ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన వీరిలో చాలామంది 2008 జూన్ 30లోగా ఉద్యోగ విరమణ పొందారు. అయితే వారికి కనీసం ఏడేళ్ల సర్వీస్ లేదంటూ పింఛన్ ఇచ్చేందుకు నిరాకరించారు. ఇలాంటి వారు ఉమ్మడి ఏపీలో 2,225 మంది ఉండగా, తాము రెండు నుంచి మూడు దశాబ్దాలుగా సేవలందించామని, తమకు కనీస పింఛన్ మంజూరు చేసేందుకు గతంలో 1992 నుంచి 2002 మధ్య కాలాన్ని కలపాలని ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్ ఆదేశాలు, 1980 ఆర్‌పీఆర్ జీవోలను పరిశీలించిన తర్వాత ఫైల్ నెం.28496/అ/2013 ప్రకారం పాత సర్వీస్‌ను పరిగణలోకి తీసుకుని 2,225 మందికి కనీస పింఛన్ సౌకర్యం కల్పిస్తూ 2014 ఫిబ్రవరి 2న ఫైల్‌పై అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సంతకం చేశారు.

### ఏపీలో అమలు... !

ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న నిర్ణయాలను అమలుచేయాలని విభజన చట్టంలో పొందుపరిచిన మేరకు ఫైల్ 28496/అ/2013 ప్రకారం ఏపీకి చెందిన 1,733 మందికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పింఛన్ సౌకర్యం కల్పిస్తూ 2014 నవంబర్ 20న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవో నంబర్ 388 జారీచేశారు. దీంతో ఆ ప్రాంతంలోని రిటైర్డు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పింఛన్ పొందుతున్నారు. తెలంగాణలో మాత్రం వారికి పింఛన్ ఇవ్వడం లేదు. రాష్ట్రంలో మొత్తం 492 మంది ఉండగా, ఒక్క ఉమ్మడి మెదక్ జిల్లాలోనే 79 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అందులో చాలామంది చనిపోయారు కూడా. అయినా వారికి పింఛన్ దక్కడం లేదు. గత ప్రభుత్వం వీరి గోడును పట్టించుకోకపోవడంతో 2017లో ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవో 388 ప్రకారం తమకు న్యాయం చేయాలని రిటైర్డ్ ఉద్యోగులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో 2021 మార్చి 15న హైకోర్టు పాత సర్వీస్‌ను పరిగణలోకి తీసుకుని వారికి పింఛన్ అందించాలని ఆదేశాలు జారీచేసినా ఇప్పటివరకు అధికారులు సహేతుక కారణాలు చూపకుండా ఫైల్‌ను పెండింగ్ ఉంచినట్లు రిటైర్డు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 జనవరి 12న ప్రజాభవన్‌లో రిటైరైన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పింఛన్ జీవోపై జారీచేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. అదేనెల 30న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమకు పింఛన్ మంజూరీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రిటైరైన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.


Government of Andhra Pradesh
Abstract
Village Administration - Inclusion of ten (10) years Part time service of 1733 Village Administrative Officer's for counting for the purpose of qualifying service for pensionary benefits- Orders- Issued.
Revenue (Ser.III) Department
G.O.Ms.No.388

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలైన జీవో కాపీ ప్రతులు

### నా భర్త చనిపోయే వరకు పింఛన్ కోసం ఎదురు చూసిండు..



ఎన్నోఏళ్ల నా భర్త ప్రజలకు సేవచేసిండు. రిటైర్డ్ అయిన తర్వాత పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరిగి.. చనిపోయే దాక ఆశతో ఎదురుచూసిండు. మాఊరు మల్లన్నసాగర్‌లో ముంపునకు గురైంది. దాంతో ఎలాంటి ఆదెరువు లేకుండా పోయింది. ఇప్పుడు దిక్కులేని పక్షుల వలే మిగిలినం. ప్రభుత్వం ఇప్పటికైనా మాపై దయతలచి భర్త పింఛన్ మంజూరీ చేస్తే నాకు ఆసరాగా ఉంటుంది.

- దాతారు సులోచన (రిటైర్డ్ వీఆర్వో సుధాకర్‌రావు సతీమణి), ఏటిగడ్డ కిష్టాపూర్, తొగుట మండలం

### ఇప్పుడైనా న్యాయం జరిగేనా



ఉమ్మడి రాష్ట్రంలో పింఛన్ ఇవ్వాలని జీవో విడుదలైనప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్య పరిష్కారం కోసం ప్రజాభవన్‌లో దరఖాస్తు చేయడంతోపాటు, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశాం. మాకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని నమ్మకంతో ఎదురుచూస్తున్నాం.

- నర్సింహారావు, రిటైర్డ్ వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

### మాకు న్యాయం చేయండి



పింఛన్ కోసం 9ఏళ్లగా పోరాడుతూనే ఉన్నాం. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకుండాపోయింది. చాలా ఏళ్ల పాటు మిరుదొడ్డి మండలం వీరారెడ్డిపల్లిలో వీఆర్వోగా పనిచేసి రిటైర్డ్ అయ్యాను. ఇప్పుడు కుటుంబ పరిస్థితి బాగాలేదు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం మాకు పింఛన్ మంజూరీచేసి న్యాయం చేయండి.

- అమ్మన రాంరెడ్డి, రిటైర్డ్ వీఆర్వో (చెల్లాపూర్, దుబ్బాక మండలం)

### మా మొర ఆలకించండి



తొగుట మండలం బండారుపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి రిటైర్డ్ అయ్యాను. అప్పటి నుంచి పింఛన్ కోసం కనిపించిన అధికారులను, నాయకులను కలిసిన. ఇప్పటివరకు మాకు న్యాయం జరగలేదు. అవసాన దశలో ఉన్నా.. మా మొర ఆలకించండి. చనిపోయేవరకైనా నాకు పింఛన్ ఇప్పించండి.

- రాంకిషన్‌రావు, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి

## ఊరునైనా విడిచిపెడతాం.. భూమిని మాత్రం విడిచిపెట్టం

● ఆందోళన వ్యక్తం చేసిన (ఆర్‌ఆర్‌ఆర్) బాధితులు


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతకుమారి

సదాశివపేట, కొండాపూర్, ఆగస్టు 6: పుట్టి.. పెరిగిన ఊరునైనా విడిచిపెడతాం.. కానీ (రీజినల్ రింగు రోడ్డు) కోసం భూమిని మాత్రం విడిచిపెట్టమని సదాశివపేట మండలం పెద్దాపూర్, కొండాపూర్ మండలం గిర్మాపూర్ గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దాపూర్‌లోని రైతువేదికలో సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి, డీఎస్పీ సత్తయ్య, నేషనల్ హైవే అథారిటీ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. (ఉత్తరభాగం-ఆర్ఆర్ఆర్) నిర్మాణం కోసం ప్రభుత్వం భూసేకరణ నిమిత్తం గత జూలై 15న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. నోటిఫికేషన్‌లో సూచించిన సర్వే నెంబర్లలోని భూములను సర్వే చేశామన్నారు. భూసేకరణ సర్వే, ప్రజాభిప్రాయ సేకరణ పనులు 21 రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ముందుగా ఎంజాయ్‌మెంట్ సర్వేచేస్తే తప్పా ఏ రైతు భూమి ఎంత విస్తీర్ణంలో (ఆర్ఆర్ఆర్)లో వెళ్లేది తెలిపోతుందని, రైతులందరూ సహకరించాలని ఆర్డీవో కోరారు. పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామాల్లో మా ఇళ్లను కూల్చేసి (ఆర్ఆర్ఆర్) నిర్మించినా పరవాలేదు. కానీ దశాబ్దాలుగా నమ్ముకుని బతుకుతున్న మా భూములు మాత్రం ఇచ్చేది లేదన్నారు. మా భూములపైనే రాష్ట్ర అభివృద్ధి ఆధారపడి ఉందా? అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన 40 ఏళ్లలో మెదక్ జిల్లాలో సింగూర్ ప్రాజెక్టు, హైదరాబాద్ తాగునీటి పైప్‌లైన్ రోడ్డు, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఐఐటీ, మూడు జాతీయ రహదారుల ఏర్పాటు కోసం చిన్న, సన్నకారు రైతుల నుంచి భూములను స్వాధీనం చేసుకుని సరైన నష్ట పరిహారం ఇవ్వలేదని గుర్తుచేశారు. జిల్లాలో ఏ అభివృద్ధి ప్రాజెక్టులు పెట్టినా పేద రైతుల భూములే కనిపిస్తాయా? అని ప్రశ్నించారు. (ఆర్ఆర్ఆర్)లో బడా రాజకీయ నాయకుల భూములు, రియల్ వ్యాపారుల భూములు, కంపెనీలకు చెందిన భూములను కాపాడేలా భూసర్వే, భూసేకరణ చేస్తారా? అని రైతులు అధికారులను నిలదీశారు. కేవలం ఇద్దరు రాజకీయ నాయకుల కోసం (ఆర్ఆర్ఆర్) డిజైన్ మార్చేశారని ఆరోపించారు. భూమికి భూమి, బహిరంగ మార్కెట్ విలువతో నష్టపరిహారం అందిస్తేనే తప్పా తమ భూములను వదులుకోమని రైతులు తేల్చిచెప్పారు. భూమిని కోల్పోతామనే బాధలో మాట్లాడుతున్నామే కానీ ఎవరినీ రెచ్చగొట్టేలా మాట్లాడడం లేదని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## రవాణా కార్యాలయంలో నూతన సిబ్బంది బాధ్యతలు


వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిసిన ఎంవీఐ సత్యనారాయణ, ఇన్‌చార్జి డీటీసీ అరుణ

కంది, ఆగస్టు 6: ఉమ్మడి మెదక్ జిల్లా రవాణాశాఖ బదిలీల్లో భాగంగా హైదరాబాద్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు కంది పరిధిలోని సంగారెడ్డి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో నూతన అధికారులు సిబ్బంది మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జి ట్రాన్స్‌పోర్ట్ అధికారిగా అరుణ, మోటారు వాహనాల తనిఖీ అధికారిగా సత్యనారాయణ, జహీరాబాద్ ఎంవీఐగా వెంకటయ్య, క్లర్కులుగా రవీందర్‌గౌడ్, గిరి, బేగ్‌లు విధుల్లో చేరారు. మంగళవారం రవాణాశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఉప కమిషనర్ డాక్టర్ కె.వెంకటరమణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలోని మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట రవాణాశాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సీసీఏ రూల్స్ ప్రకారం బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించాలని ఆదేశించారు.

## స్కాలర్‌షిప్స్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

● గంటపాటు పాత హైవేపై బైఠాయింపు
● ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
● పోలీసులతో ఏబీవీపీ నేతల వాగ్వాదం
● బలవంతంగా వ్యాన్ ఎక్కించి స్టేషన్‌కు తరలింపు

రామాయంపేట, ఆగస్టు 6: పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలంటూ విద్యార్థిలోకం రోడ్డెక్కింది. మొదట భారీ ర్యాలీగా కదిలొచ్చి పట్టణంలోని పాత హైవేపై రాస్తారోకోకు దిగారు. ఈ ఆందోళనకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు మంగళవారం తెరలేపారు. గత ప్రభుత్వం లాగానే ప్రస్తుత అధికార పార్టీ సైతం విద్యార్థులతో చెలగాటమాడుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంటపాటు వందలాది మంది రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాలు పెద్దఎత్తున నిలిచి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. ఆందోళన విరమించమంటూ భీష్మించారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, ఏబీవీపీ నేతలకు వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు విద్యార్థి నేతలను బలవంతంగా వ్యాన్ ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


రామాయంపేటలో విద్యార్థుల రాస్తారోకో

## హాల్ మార్కింగ్ ఆభరణాలే కొనాలి

● బీఐఎస్ జాయింట్ డైరెక్టర్, శాస్త్రవేత్త సవిత


సంగారెడ్డిలో నిర్వహించిన అవగాహన సదస్సులో బీఐఎస్ అధికారులు, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6: భారతీయ ప్రమాణాల బ్యూరో నిర్ధారించిన హాల్ మార్కింగ్ ఉన్న ఆభరణాలు మాత్రమే కొనాలని బీఐఎస్ జాయింట్ డైరెక్టర్, శాస్త్రవేత్త సవిత సూచించారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బీఐఎస్ ఆధ్వర్యంలో బంగారం వర్తక వ్యాపారులు, ఆభరణాల తయారీదారులు, వినియోగదారులకు హాల్ మార్కింగ్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారు ఆభరణాల శుద్ధతను నిర్ధారించేందుకు భారత ప్రభుత్వం హాల్‌మార్కింగ్ పద్ధతిని ప్రవేశపెట్టిందని, ఇందులో భాగంగానే దేశవ్యాప్తంగా హాల్‌మార్కింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్న జిల్లాలో ఈ విధానాన్ని తప్పనిసరి చేసిందన్నారు. ప్రస్తుతానికి జిల్లాలో హాల్‌మార్కింగ్ తప్పనిసరి కాకపోయినా తయారీదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి బీఐఎస్ లైసెన్సులు పొందాలని సూచించారు. వినియోగదారులకు శుద్ధమైన ఆభరణాలు అందించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని కోరారు. నాణ్యత పొందడం వినియోగదారుల హక్కు అని, ప్రతిఒక్కరూ విధిగా తమ పాత్ర పోషించాలన్నారు. ప్రతి వస్తువుపై ఐఎస్ఐ మార్కు, బంగారు ఆభరణాలపై హాల్‌మార్క్, ఎలక్ట్రానిక్ వస్తువులపై రిజిస్ట్రేషన్ మార్కు విధిగా చూడాలని, ఈ ముద్రలు కనిపించకపోతే బీఐఎస్ కేర్ యాప్ ద్వారా ఫిర్యాదు అందించాలని తెలిపారు. ఫిర్యాదు అందితే సంబంధిత తయారీ సంస్థలపై బీఐఎస్ చర్యలు చేపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ హాల్ మార్కింగ్ ఏజెంట్ ప్రశాంతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చండి

● రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి


సంగారెడ్డిలో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశిస్తున్న భారతీ హోళికేరి


శివ్వంపేట చిన్న గొట్టిముక్ల పాఠశాలలో నీటిని పరిశీలిస్తున్న భారతీ హోళికేరి

సంగారెడ్డి రూరల్/హత్నూర/శివ్వంపేట/నర్సాపూర్, ఆగస్టు 6: ప్రజల ఆరోగ్యాలు పరిరక్షించేలా తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుపర్చాలని రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి అధికారులను ఆదేశించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మంగళవారం సంగారెడ్డిలోని 32వ వార్డులో కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ఆమె సందర్శించి పరిసరాలు మంచినీటి ట్యాంకులను పరిశీలించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీపీవో సాయిబాబా, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహన్, డీఈ ఇంతియాజ్, వార్డు కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు. పచ్చదనం పరిశుభ్రతపై అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషిచేయాలని రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామాన్ని మంగళవారం సందర్శించి పాఠశాల, పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పచ్చదనం-స్వచ్ఛదనంలో అందరినీ భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగా బోర్పట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదని కొందరు విద్యార్థులు వారి దృష్టికి తీసుకెళ్లగా.. ప్రధానోపాధ్యాయుడిపై అసహన వ్యక్తం చేశారు. బోర్పట్ల గ్రామ శివారులోని ఎపిటోరియా పరిశ్రమలో అక్రమ నిర్మాణాలు, కాలుష్యంపై స్థానికులు కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ నిర్మాణాలపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అక్కడే ఉన్న జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాను ఆదేశించారు. వారి వెంట ట్రైనీ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఎంపీడీవో శంకర్ ఉన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గొట్టిముక్ల గ్రామంలోని పాఠశాలలో తాగునీరు, మురుగు కాలువలను, రోడ్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యా బోధనపై ఆరాతీశారు. పాఠశాలలో మొక్కలు నాటి నీళ్లుపోశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీవో తిరుపతిరెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, నారాయణరావు, నరేందర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సాపూర్ పట్టణంలో రాష్ట్ర, ఆర్కియాలజీ శాఖ డైరెక్టర్ భారతీ హోళికేరి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యటించారు. పట్టణ సమీపంలో ఉన్న కోమటికుంట వద్ద పెద్దఎత్తున చెత్త ఉండడంతో పాటు విలువైన కుంట పరిధిలోని భూమి ఆక్రమణకు గురికావడం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాయరావు చెరువును సందర్శించి పర్యాటక పరంగా అభివృద్ధి చేయడానికి అవకాశమున్నందున పూల మొక్కలతోపాటు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా కృషి చేయాలని సూచించారు. అలాగే 4వ వార్డులోని వాటర్ ట్యాంకు వద్దకొచ్చి ట్యాంకులో వచ్చే నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎంత ఉందో పరిశీలించారు. పట్టణ పరిధిలోని హన్మంతాపూర్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో యాదయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ జైతురాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.


కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయం

## శ్రావణమాసం శుభకరం

● కేతకీలో నెలరోజుల పాటు కొనసాగనున్న ప్రత్యేక పూజలు

ఝరాసంగం, ఆగస్టు 6: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం ప్రారంభమైన పూజలు ఆలయంలో నెలరోజులపాటు జరగనున్నాయి. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రావణమాసంలో నాలుగవ సోమవారం మహారాష్ట్రలోని అమహదపూర్ నుంచి వేలాదిమంది భక్తులు భజన కార్యక్రమాలతో పాదయాత్రగా స్వామి దర్శనం కోసం తరలివస్తారు. శ్రావణమాసం సందర్భంగా జహీరాబాద్ నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతారు.

### ఆలయాల్లో శివరాధన



శ్రావణమాసం ఎంతో పవిత్రమైనది. ఆలయాల్లో శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపడుతారు. నెలరోజులపాటు కేతకీ ఆలయం భక్తులతో రద్దీగా ఉంటుంది. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

- సంగయ్య స్వామి, అర్చకుడు

### ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



శ్రావణమాసాన్ని దృష్టిలో పెట్టుకొని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం.

- శశిధర్‌గుప్తా, ఆలయ ఈవో

# మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన జయశంకర్

తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పడంలో ఆయన కృషి ఎంతో ఉందని, తెలంగాణ ఏర్పాటు కోసం జయశంకర్ అహర్నిశలు కృషి చేశారని వారు కొనియాడారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


ములుగు: హార్టికల్చర్ యూనివర్సిటీలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తూ..


హుస్నాబాద్: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో రామ్మూర్తి


కుకునూరుపల్లి: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


గజ్వేల్: జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తూంకుంట నర్సారెడ్డి


మద్దూరు: జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సెక్రటరీ


చేర్యాల: కొమురవెల్లి జీపీ ఆవరణలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తూ..


మర్కుక్: జయశంకర్ చిత్రపటానికి నివాలులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

### కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

దుబ్బాక, ఆగస్టు6: కేంద్ర పౌర విమానాయ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి డిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు.

### ధరణి ఆపరేటర్ సస్పెన్షన్

చిన్నకోదూరు, ఆగస్టు 6: చిన్నకోదూరు తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా పని చేస్తున్న సంధ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మను చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ జయలక్ష్మి తెలిపారు.

### సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

ములుగు, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బుడిగె మహేష్ పేర్కొన్నారు. ములుగులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు తూర్పింటి రాజు, లక్ష్మణ్, రాములు, నాగరాజు, సంజీవులు, బాలు, నాగేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

### రైతుబీమా దరఖాస్తుకు గడువు పెంపు-ఏవో

మద్దూరు, ఆగస్టు 6: రైతుబీమా గడువును ప్రభుత్వం ఈ నెల 7 వరకు పొడిగించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో బి. రామకృష్ణ సూచించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జూన్ 28 లోపు పట్టాదారు పాసుబుక్ వచ్చిన రైతులతో పాటు గతంలో పట్టాపాసు పుస్తకం ఉండి దరఖాస్తు చేసుకోని రైతులు ఈ నెల 7లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు అఖిల్, అనూష, కల్పన, రాధిక, రాకేష్ ఉన్నారు.

### మద్దూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన షేక్ మహబూబ్

మద్దూరు, ఆగస్టు 6: మద్దూరు ఎస్ఐగా షేక్ మహబూబ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. మండలంలో ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణ కృషి చేస్తానన్నారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

కొండపాక, ఆగస్టు 6: విద్యుదాఘాతంతో బర్రె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బందారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన దుబ్బాల యాదయ్య బర్రెలు మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్ తగిలి ఒక బర్రె అక్కడిక్కడే మృతిచెందింది.

### ఫిషరీస్ చైర్మన్‌ను కలిసిన గంగపుత్ర సంఘం సభ్యులు

చిన్నకోదూరు, ఆగస్టు 6: రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌ను హైదరాబాద్‌లో చిన్నకోదూరు గ్రామ గంగపుత్ర సంఘం సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.



## నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి సమీక్ష

హుస్నాబాద్, ఆగస్టు 6: హుస్నాబాద్ పట్టణంలోని ఐఓసీ భవనంలో నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు'

మిరుదొడ్డి,ఆగస్టు 6: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైనా భోజనంతోపాటు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఆయనవెంట మండల విద్యాధికారి ప్రభుదాస్, పాఠశాల ప్రత్యేకాధికారి స్వర్ణలత, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## గోదావరి జలాలకు పూజలు


పూజలు చేస్తున్న నాయకులు

చిన్నకోదూరు, ఆగస్టు 6: రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి చేరిన గోదావరి జలాలకు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి'

గజ్వేల్, ఆగస్టు 6: గజ్వేల్‌లో ప్రభుత్వ మహిళా కళాశాల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి కవితకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ ఎడ్యుకేషన్ హబ్‌లను నిర్మించారని, కానీ విద్యార్థులు ఉండటానికి హాస్టల్ సీట్లు తక్కువగా కేటాయించారన్నారు. ఆయనవెంట నాయకులు వినయ్, శ్రావణ్, కుమార్ తదితరులున్నారు.

## మతిస్థిమితం లేని వృద్ధుడిని కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు


వృద్ధుడ్ని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్, ఆగస్టు 6: మతిస్థిమితం లేక హుస్నాబాద్‌లో తిరుగుతున్న ఓ వృద్ధుడ్ని స్థానిక సీఐ శ్రీనివాస్ మంగళవారం ఇంటికి చేర్చారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం జూపాకకు చెందిన పల్లె శంకరయ్య అనే వృద్ధుడు మతిస్థిమితం లేక హుస్నాబాద్‌లో తిరుగుతుండగా అతని ఫోటో తీసి సామాజిక మాధ్యమాల్లో పంపించి కుటుంబీకుల వివరాలను తెలుసుకున్నారు. వారిని పిలిపించి శంకరయ్యను అప్పగించారు. మానవతా ధృక్పథంతో స్పందించిన సీఐ శ్రీనివాస్‌కు అతడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## 'యూనివర్సిటీ పేరును మార్చే ఆలోచనను విరమించుకోవాలి'

హుస్నాబాద్, ఆగస్టు 6: తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును మార్చి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు నిరసన తెలిపారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర అవతరణకు తన ప్రాణాన్నే అర్పించిన పొట్టి శ్రీరాములు పేరును అలాగే ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, మహిళా ప్రతినిధులు తదితరులున్నారు.

## మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు

● కలెక్టర్ మనుచౌదరి


మొక్కను నాటి నీరు పోస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కోహెడ, ఆగస్టు 6: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎం.మనుచౌదరి అన్నారు. మంగళవారం కోహెడ మండలంలోని తంగళ్లపల్లి కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పదోతరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల జీవశాస్త్రం పరిజ్ఞానాన్ని పరిశీలించారు. ఏదైనా సబ్జెక్టు అర్థం కాకపోతే సంబంధిత ఉపాధ్యాయులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా విద్యార్థులను వ్యక్తిగతంగా వారి సామర్థ్యాలను పరీక్షించి వారు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి, ప్రతి నెలలో ఒక్కొక్క సబ్జెక్టు చొప్పున అన్ని సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాలయానికి సీసీ రోడ్, డార్మెంటరీ, దోమలు రాకుండా కిటికీలకు జాలి, కొత్త టాయిలెట్స్, బోర్‌వెల్, సామూహిక ఇంకుడు గుంత కావాలని విద్యాలయ ప్రిన్సిపాల్ హిమబిందు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా విద్యాలయానికి అత్యవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతానని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సురేఖ, ఏఈ సాయి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

● జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్


మిరుదొడ్డి: పిల్లలకు అన్నప్రాశన చేస్తున్న ఆశాలు

గజ్వేల్, ఆగస్టు 6: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నవజాత శిశువులకు తల్లిపాలను ఇవ్వాలని, బిడ్డ పుట్టిన గంట లోపు తల్లిపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సరిత, డాక్టర్ త్రివేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, నర్సింగ్ సూపర్‌వైజర్ సువర్ణ, హెడ్‌నర్సు శారద, జగదాంబ, వాసుదేవ్, ఫార్మసిస్టు నర్సింహులు, మల్లేశ్, రాము, పరమేశ్వరాచారి తదితరులున్నారు.

● **కోహెడ:** తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని పంచాయతీ కార్యదర్శి కవిత పేర్కొన్నారు. తీగలకుంటపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు అంగన్వాడీలలో అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధ, సమ్మవ్వ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

● **మిరుదొడ్డి:** మండల కేంద్రమైన మిరుదొడ్డిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా బాలింతలకు, గర్భిణీలకు తల్లిపాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం సామూహిక శ్రీమంతాలను నిర్వహించారు. అలాగే విద్యార్థులకు అక్షరభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.

## టీకాలతో జీవాలకు ఆరోగ్యం

● పశు వైద్యాధికారిని శ్వేత


టీకాలు వేస్తున్న దృశ్యం

జగదేవ్ పూర్, ఆగస్టు 6: ముందస్తు టీకాలతోనే సన్న జీవాలకు మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని మండల పశు వైద్యాధికారిని శ్వేత అన్నారు. మండల పరిధిలోని నబినగర్‌లో మంగళవారం నీలి నాలుక(బ్లూటంగ్) టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్, ఓఎస్ హరిప్రసాద్, రైతులు లింగం, బిక్షపతి, ఐలయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

## వ్యక్తిని బెదిరించిన 11 మందిపై కేసు

మద్దూరు, ఆగస్టు 6: కులబహిష్కరణ చేసిన విషయంలో పెట్టిన కేసును మనసులో పెట్టుకుని దాడి చేసిన 11 మందిపై బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని రేబర్తికి చెందిన ఒగ్గు నర్సయ్య కుటుంబాన్ని కులసంఘం పెద్దలు గతంలో కులబహిష్కరణ చేశారు. ఈ విషయమై కేసు పెట్టడంతో అది మనసులో పెట్టుకుని మంగళవారం వ్యవసాయ భూమి వద్ద పనులు చేస్తున్న తనను దూషిస్తూ 'మాపై కేసు పెడతావా' అంటూ ఒజ్జల ఉప్పలయ్య, బెల్లపు యాదయ్య, ఒగ్గు మల్లేశం, ఒగ్గు ఓజయ్య, శవల్ల బాలమల్లు, వజ్జల పెద్ద రాజయ్య, ఈరి నరేష్, ఒడ్డు రవి, బియ్య మహేష్‌తో పాటు మరికొందరి కొట్టి చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డట్లు ఆరోపించాడు. అడ్డుకోయిన తన భార్యను కూడా దూషించినట్లు తెలిపాడు. వారిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఎస్ఐని కలిసిన బీజేపీ నాయకులు

మర్కుక్, ఆగస్టు 6: మర్కుక్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్‌ను మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రమేష్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మార్వోకు సమ్మె నోటీసు అందజేత

కుకునూరుపల్లి, ఆగస్టు 6: ఈ నెల 8న నిర్వహించే ఒక రోజు సమ్మె నోటీసును మంగళవారం కుకునూరుపల్లి ఎమ్మార్వో మల్లికార్జున్‌రెడ్డికి సీఐటీయూ మండల అధ్యక్షుడు సాయికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8న ఒకరోజు సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. రు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట నరహరి ఉన్నారు.

## ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మర్కుక్, ఆగస్టు 6: ఓపెన్‌స్కూల్ విధానంలో ఎలాంటి విద్యార్హత లేకుండా 10వ తరగతి, ఇంటర్ చదవడానికి షెడ్యూల్ విడుదల చేశారు. 2024-25 గాను ఆగస్టు 8వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ దరఖాస్తు చేసుకోవాలని సెంటర్ కోఆర్డినేటర్ వెంకటరాములు తెలిపారు. మరిన్ని వివరాలకు (9490022739, 6303324561) నెంబర్లను సంపదించాలన్నారు.

## సంఘం సభ్యత్వం కోసం ఆందోళన

కొండపాక,ఆగస్టు 6: కొండపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం ఇవ్వాలంటూ మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. సహకార సంఘం వద్దకు వచ్చిన రైతులు సంఘం సీఈవో రాజును సభ్యత్వం ఇవ్వాలని కోరగా అది తన పరిధిలో లేదని, చైర్మన్ చెబితేనే సభ్యత్వం ఇస్తానని తెలిపారు. ఆగ్రహించిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతీ రైతుకు సభ్యత్వం ఇవ్వాలని నిబంధన ఉన్నా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. తమకు అనుకూలంగా ఉన్న కొంతమందికి సభ్యత్వం ఇస్తున్నారని ఆరోపించారు.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కుకునూరుపల్లి, ఆగస్టు 6: ఆగస్టు 15న కుకునూరుపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించే పరేడ్‌కు విద్యార్థులు సిద్ధమయ్యారు. ఆగస్టు 15న నిర్వహించే పరేడ్‌కు రూ. 70 వేల విలువ చేసే నకిలీ తుపాకీలు, దుస్తులు, ఇతర సామగ్రిని పీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పొల్కంపల్లి నరేందర్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులకు తోడుగా నిలుస్తున్న నరేందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, ఉపాధ్యాయులున్నారు.

# నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

● సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

చిన్నకోదూరు, ఆగస్టు 6: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మంగళవారం మండలంలోని రామంచ శివారులోని శ్రీ రంగనాయకస్వామి బీ ఫార్మసీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చిన్నకోదూరు ఎస్ఐ బాలకృష్ణ, కళాశాల సెక్రటరీ సుకేశ్‌రెడ్డి, ట్రెజరర్ ప్రద్యుమ్న, ప్రిన్సిపాల్ పరమేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 18, 16వ వార్డుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో రెండో రోజులో భాగంగా మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య ఆధ్వర్యంలో చెరువు, కుంటలను శుభ్రం చేయించడంతో పాటు మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. ఆయనవెంట కౌన్సిలర్లు బొగ్గుల చందు, తలకొక్కుల దుర్గాప్రసాద్, మునిసిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.


హుస్నాబాద్‌రూరల్: మొక్కలు నాటుతున్న నాయకులు

● **మద్దూరు** మద్దూరు మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంచినీళ్ల ట్యాంకుల్ని శుభ్రపర్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. ఈ సందర్భంగా రేబర్తి గ్రామంలో మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మాదవ్‌జాదవ్, వెంకటేశ్వర్లు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● **చేర్యాల:** స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా చేర్యాల మునిసిపాలిటీ ఆధ్వర్యంలో కుడిచెరువు కట్ట వద్ద పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా కట్ట ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తచెదారం తొలగించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కమిషనర్ నాగేందర్, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మేనేజర్ ప్రభాకర్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా కొమురవెల్లి మండలం అయినాపూర్‌లో మండల ప్రత్యేకాధికారి ఎస్‌కె అహ్మద్ మొక్కలు నాటారు. వాటర్‌ట్యాంకులను పరిశుభ్రం చేయించారు.


చిన్నకోదూరు: కళాశాల ఆవరణలో మొక్కను నాటుతున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

● **హుస్నాబాద్‌రూరల్:** స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మంగళవారం హుస్నాబాద్ మండలంలోని మడద, మహ్మదాపూర్, నాగారం, ఉమ్మాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పంచాయతీ అధికారులతో కలిసి వీధులు శుభ్రం చేశారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బంక చందు, మడప జైపాల్‌రెడ్డి, సంగ కుమార్, బాలయ్య, శ్రీధర్, మామిడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కడవేరుగు క్లస్టర్‌కు ఏఈవో నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, ఆగస్టు 6: చేర్యాల మండలం కడవేరుగు క్లస్టర్ ఏఈవోగా సమజామాతను నియమిస్తూ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నియమించారు. చేర్యాల మండలంలోని కడవేరుగు, పోతిరెడ్డిపల్లి గ్రామాల క్లస్టర్ పరిధిలో కొన్నినెలలకాలంగా ఏఈవో లేక రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతున్న విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'కడవేరుగు క్లస్టర్ ఏఈవో లేక రైతుల ఇక్కట్లు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన వ్యవసాయశాఖ అధికారులు సమజాతను నియమించారు.

## జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీలు


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 6: జిల్లాలో సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ రవాణా నివారణ గురించి వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ వాహనాల తనిఖీలలో 52 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 49 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు లక్ష్మీబాబు, విద్యాసాగర్, ఉపేందర్, శ్రీను, సైదా, లతీఫ్, శ్రీనివాస్, ఎస్ఐలు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## రోడ్డుపై లారీ బోల్తా



కొండపాక, ఆగస్టు 6: మండలంలోని దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై మూలమలుపు వద్ద మంగళవారం సిమెంట్ లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

## గద్దర్ ఆశయసాధనకు కృషిచేస్తాం

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్, ఆగస్టు 6: గద్దర్ ఆశయసాధనకు కృషిచేస్తామని గజ్వేల్ సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గద్దర్ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్దర్ ఆశయసాధనకు కృషిచేస్తామన్నారు. ఆయనవెంట మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బెజుగామ శివరాంరెడ్డి, నక్క రాములు, సుభాష్ చంద్రబోస్, సర్దార్ ఖాన్ నంగునూరు సత్యనారాయణ, గంగిశెట్టి రాజు, మోహన్, కప్ప భాస్కర్, అజ్గర్, టిల్లురెడ్డి, ప్రవీణ్‌గుప్తా, కన్నాయాదవ్ ఉన్నారు.

## సుష్మాస్వరాజ్ వర్ధంతి

చేర్యాల, ఆగస్టు 6: బీజేపీ నేత సుష్మాస్వరాజ్ వర్ధంతిని మంగళవారం కొమురవెల్లి మండలకేంద్రంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో సీనియర్ నాయకుడు కుడికుడి మల్లేశం తదితరులు సుష్మా స్వరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కటకం అమర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పబ్బోజు రాజు, యువమోర్చ అధ్యక్షుడు సనాది కరుణాకర్, ఉపాధ్యక్షుడు తిగుల్ల మహేశ్, నాయకులు స్వామలపల్లి భిక్షపతి, శ్రీనివాస్‌చారి, కుడికాల సందీప్, సార్ల హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి

దుబ్బాక/మిరుదొడ్డి,ఆగస్టు6: పేదల పక్షపాతి దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అని ఆయన సతీమణి సుజాత, తనయుడు సతీష్‌రెడ్డిలు కొనియాడారు. మంగళవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్‌లోని దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి స్మృతివనంలో వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలను నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజమౌళి, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు రవి, రాజయ్య, కైలాస్, శ్రీనివాస్, ర్యాకం శ్రీరాములు తదితరులున్నారు.

## ముగిసిన రోహిత్ అంత్యక్రియలు

దూళిమిట్ట,ఆగస్టు 6: అమెరికాలోని వాషింగ్టన్ సిటీ సియాటిన్‌లో గత నెలలో అనుమానాస్పదంగా మృతిచెందిన తుషాలపురం సాయి రోహిత్(23) మృతదేహం మండలంలోని కూటిగల్ గ్రామానికి మంగళవారం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా వారి సహకారంతో చేరుకుంది. ప్రయోజకుడు అవుతాడు అనుకున్న కుమారుడు విగతాజీవిగా రావడంతో తల్లితండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రోహిత్ మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయంత్రం గ్రామంలో సాయి రోహిత్ అంత్యక్రియలు ముగిశాయి.

## 'చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి'


వర్గల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్నబీజేపీ నాయకులు

గజ్వేల్/వర్గల్, ఆగస్టు 6: కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు దళితుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని గజ్వేల్ మండల బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ముంద్రాతి రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల సభలో ఎస్సీ డిక్లరేషన్లో ఇచ్చిన ప్రధాన హామీలైన అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12లక్షలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు, షెడ్యూల్డ్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునఃనిర్మాణం తదితర అంశాలకు రాష్ట్ర బడ్జెట్లో ఎలాంటి నిధులు కేటాయించకపోవడాన్ని ఖండించారు. ఆయనవెంట బీజేపీ నాయకులు బారు అరవింద్, నర్సింహులు, భజరంగ్‌దళ్ అనిల్, స్వామియాదవ్ ఉన్నారు. అసెంబ్లీల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ చేవెళ్లలో సభలో ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రధాన హామీలకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తున్నట్లు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నత్తి శివకుమార్ పేర్కొన్నారు. బీజేపీ శ్రేణులతో కలిసి తహసీలాల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీరాం శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పంపరి రమేశ్, కిసాన్ మోర్చ నాయకులు దిండి నాగరాజు తదితరులు ఉన్నారు.

## పరుగు పందెంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన నితీషా


నితీషాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక, ఆగస్టు 6: మండలంలోని సిరసనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దబ్బెడ నితీషా పరుగు పందెంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సిద్దిపేట అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన అండర్ 14 కేటగిరిలో జిల్లా స్థాయి 400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించి బంగారు పతకం అందుకుంది. దీంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దివిఠల్ తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● చేర్యాల సీఐ ఎల్. శ్రీను

మద్దూరు/సిద్దిపేట క్రైం, ఆగస్టు 6: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను సూచించారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌ల లింకు ఓపెన్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ మహబూబ్, ఏఎస్ఐ జగదీశ్వర్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. సిద్దిపేట పట్టణంలోని పారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఈవ్‌టీజింగ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సిద్దిపేట షీ టీం బృందం సభ్యులు పాల్గొన్నారు.